తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ


# 'కుక్కపిల్లా - అగ్గిపుల్లా - సబ్బుబిళ్ళా -'

## - తపతి -

సాయంత్రం మూడు గంటల సమయం. ఇంకా ఎండ తీవ్రత తగ్గలేదు. మార్చి నెలాఖరుకే ఎండలు మండిపోతున్నాయి. ఇంకా పిల్లలకు ఒక పూట స్కూలు మొదలు పెట్టలేదెందుకో! చిన్ని చిన్ని పాపలతో బుజ్జి బుజ్జి బాబులతో కాన్వెంటు రిక్షాలు రోడ్లమీద సందడిగా తిరిగే వేళ, మరి కొంత మంది చిన్నారులు భుజాలకు తగిలించు కొన్న బరువైన బ్యాగ్‌ల భారం వీపుపై మోస్తూ అలసిన మొహాలతో ఆనందంగా ఇంటికి అరుదెంచే వేళ బాల్కనీలో నిల్చొని ఎదురుగా ఉన్న మేడను తిలకించడం మూడు నెలలుగా నా దిన చర్యలో ఒక ముఖ్య భాగమైంది.

రోజూలాగానే ఆ ఇంటి ముందు ఆగిన రిక్షాలోని ఆరేళ్ళ పాప పింకీని ఎత్తుకొని, బ్యాగ్ వాటర్ బాటిల్ అందుకొని లోనికి తీసుకెళ్ళాడు తోటమాలి. అప్పుడే ఏదో పేచీ పెడుతూ మాలి చంకలో నుండి కిందకు దిగుతోంది పింకీ.

రోజూ పింకీ వచ్చేప్పటికే కుక్కపిల్ల జూలీకి స్నానం చేపించి ఆరబెట్టి ఉంచే పనికుర్రాడు ఎందుకో ఈ రోజు ఆలస్యం చేశాడు. పంపు క్రింద తెల్లటి సబ్బు నురగతో జూలీకి స్నానం



చెయించి టవలితో తుడిచి పొడిగా ఆరేవరకు క్రిందికి వెళ్ళకుండా వరండాలోని సిమెంట్ స్థంభానికి కట్టి బ్లాంకెట్ పై పడుకో బెట్టాడు.

పింకీ మాలి చంకలోనుండి దిగి జూలీని ఒకసారి ఎత్తి ముద్దుపెట్టుకుంది. జూలీ కూడా తన నాలుకతో పింకీ మొహాన్ని నాకుతూ మధ్యలో ఇంకా తడి ఆరని శరీరాన్ని విదిలించింది.

అప్పుడే బయటకు వచ్చిన పింకీ తల్లి బట్టలు మార్చుకొని పాలు త్రాగి ఆడుకుందువు రా తల్లీ అంటూ పింకీని పిలిచింది. ఒకసారి జూలీ వళ్ళువిమిరి తను వచ్చేవరకూ కాలక్షేపంగా ఒక బంతిని జూలీకి ఇచ్చి లోనికి వెళ్ళింది పింకీ. మళ్ళా వెంటనే రెండు బిస్కట్లు తెచ్చి ఒకటి జూలీకి తిన్పించి రెండోది బ్లాంకెట్ పై ఉంచి లోనికి వెళ్ళింది.

పింకీ లోనికి వెళ్ళడంతో అప్రయత్నంగా నా కళ్ళు గేటు వైపు చూశాయి. రోజు నాతోపాటు ఈ దృశ్యాన్ని తిలకించే మరో ప్రాణి కూడా అక్కడ చేరి తన్మయత్వంలో జూలీని చూస్తుండటం చూసిన నా మనసొక నిట్టూర్పు విడిచింది.


జూలీ బంతిని కాలుతో తొయ్యడంతో బంతి దూరంగా దొర్లుకుంటూ వెళ్ళింది. బంతి కోసం జూలీని గొలుసు లాగుతూ కుయి కుయి లాడుతోంది. అది చూసిన తోటమాలి బంతిని జూలీకి ఇచ్చి జేబులోనుండి బీడి తీసి నోటిలో పెట్టి అగ్గిపెట్టె తెరిచాడు. అగ్గిపుల్లలు అయిపోయాయి కాబోలు పెట్టెను బయటకు విసిరి, గేటు దగ్గిర ప్రాణిని ఒక కసురు గసిరి అగ్గిపుల్ల కోసం కాబోలు ప్రక్కనే వున్న బడ్డీకొట్టు దగ్గిరకు దారితీశాడు.

జూలీ బంతిని మళ్ళా కాలుతో అటూ ఇటూ తొయ్యడంతో బంతి గేటు వైపుగా దొర్లుకుంటూ వచ్చింది. జూలీ మళ్ళా బంతి కోసం కుయికుయిలాడుతూ గొలుసును గింజుతోంది. అక్కడే వున్న బిస్కట్‌ని ముక్కుతో తొయ్యడంతో బిస్కట్ మరి కాస్త దూరం జరిగింది. దూరంగా జరిగిన బిస్కట్‌ని కాలితో అందుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది జూలీ.

ఇదంతా చూస్తున్న గేటు దగ్గిర ప్రాణి మరి ఆగలేక గేటు క్రింది ఖాళీలోనుండి దూరి బంతి పట్టుకుని జూలీ దగ్గరకు పరుగెట్టింది. బిస్కట్ తీసి జూలీ కందించింది. తన రెండు చేతుల్తో జూలీని ఎత్తి ముద్దులు పెట్టుకుంది. జూలీని క్రిందపెట్టి మెడలోని గొలుసు తప్పించింది. మళ్ళా జూలీని ఆప్యాయంగా పొదివిపట్టి ఎత్తుకొని మరొకచేత్తో బంతిని పట్టుకొని రోజు జూలీతో పింకీ ఆడుకొనే లానులోకి పరుగెట్టింది. జూలీని ఓ సారి గట్టిగా ముద్దుపెట్టుకొని బంతిని విసిరి జూలీని క్రిందకు దింపింది. జూలీ పరుగెట్టి బంతిని నోటితో పట్టి తెచ్చి ఆ ప్రాణి దగ్గర పెట్టింది. ఆ ప్రాణి మళ్ళా బంతిని విసిరింది. ఈసారి బంతి ప్రక్కనే వున్న గులాబీ గుబురులో ఇరుక్కుంది. జూలీ బంతిని తియ్యలేక గుబురుచుట్టూ తిరుగుతూ మొరుగుతోంది. ఆ ప్రాణి కూడా బంతిని తియ్యడానికి కొమ్మలు తప్పిస్తూ తంటాలు పడుతోంది.

అప్పుడే శుభ్రంగా తయారై, జూలీతో ఆటకు బయటకు వచ్చిన పింకీ ఈ దృశ్యం చూసి కెవ్వున కేక పెట్టింది. ఆ కేకకు పింకీ తల్లి, కుక్క పిల్లకు స్నానం చేయించిన కుర్రాడు, తోటమాలీ ఒక్క పరుగున వచ్చారు. అమ్మగారిని చూసి బీడీ బయటకు విసిరాడు మాలి. తడి వంటితో లానులో దొర్లడంతో తెల్లని జూలీ బొచ్చుఅంతా మట్టి కొట్టుకొని అసహ్యంగా కన్పిస్తోంది. ఎదురుగా మట్టి కొట్టుకుపోయిన అతుకుల గవునుతో, చింపిరి జుత్తుతో గుడ్లు మిటకరించి పింకీని చూస్తూ కన్పించిందా ఆరేళ్ళపిల్ల.

జూలీ అలా తయారవడానికి కారణమైన ఆ పిల్లను తలవంచి రెండు గుద్దులు గుద్దాడు రోజూ కుక్కపిల్లకు స్నానం చేయించే కుర్రాడు. జూలీని మళ్ళా సబ్బుతో కడిగి సాంబ్రాణి పొగ వెయ్యాలనే కోపంతో. అగ్గిపుల్ల కోసం బడ్డీ వాడితో బాతాఖానీ కొట్టిన మాలి అయ్యగారొస్తే జరిగే రణరంగం కళ్ళలో మెదలగా బిత్తరపోయిన కళ్ళతో ఏడుపు కూడా రాని ఆ పిల్ల వీపుపై మరో రెండు వడ్డించి గేటు బయటకు ఒక్కతోపు తోశాడు.



## ప్రొఫెసర్ రావుకు 'పద్మశ్రీ'

భారత దేశపు మొదటి కంప్యూటర్ శాస్త్రవేత్తగా, ఎలక్ట్రానిక్స్ రంగంలో విశేష కృషి చేసిన ప్రొఫెసర్ పి.వి.ఎస్. రావుకి ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవంనాడు 'పద్మశ్రీ' బిరుదునిచ్చి కేంద్ర ప్రభుత్వం సత్కరించింది.

బొంబాయిలోని 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చి' సంస్థలో ఆయన గడచిన 32 సంవత్సరాలుగా కంప్యూటర్లు గురించి పరిశోధనలు చేస్తున్నారు.

శ్రీ రావు బరంపురంలో 1936లో జన్మించారు. 1948లో గాంధిజీ హత్య వార్త విని కలత చెందిన శ్రీ రావు మొదటగా కవిత్వం రాశారు. అయితే ఆయన కవిగా కన్నా విజ్ఞాన శాస్త్ర పరిశోధకుడిగానే పెరిగారు. 1955లో కాశీ హిందూ విశ్వ విద్యాలయం నుంచి ఫిజిక్స్‌లో ఎం.ఎస్‌సి. పట్టంపొంది బొంబాయి 'టాటా' పరిశోధనా సంస్థలో చేరారు. టి.వి. స్క్రీన్స్ సాంకేతిక విభాగంలో ఆయన చేసిన పరిశోధనకుగాను 1961లో పిహెచ్.డి. లభించింది.

తర్వాత ఆయన ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్‌లో ఉన్నత శిక్షణ పొందారు. అక్కడ నుంచి తిరిగి వచ్చాక దేశీయంగా తయారైన సాంకేతిక పరికరాలతో కంప్యూటర్ నిర్మాణానికై ఆయన కృషి చేశారు.

ఇప్పుడు ఆయన మనిషి ఇచ్చే ఆజ్ఞల్ని గ్రహించి పనిచేసే కంప్యూటర్ వ్యవస్థ నిర్మాణానికై కృషి చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశోధనలకు, ఎన్నో సైన్స్ వ్యాసాలు రాసినందుకు శ్రీ రావుకి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఎన్నో ఉన్నత పదవులు ఆయనని వరించాయి. ప్రస్తుతం ఆయన కంప్యూటర్స్ పరిశోధనా విభాగం (బొంబాయి) శాస్త్రవేత్తలకి నాయకత్వం వహిస్తున్నారు. ఆంధ్ర శాస్త్రవేత్తలలో మణిపూస శ్రీ రావు.